

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 714 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట @ రూ.126

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.126, కనిష్టం రూ.100, సరాసరి రూ.116 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
36.2°/ 22.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్క పోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 8.278 టీఎంసీలు



తుంగభద్ర జలాశయంలోకి చేరిన నీరు

బొమ్మనహాళ్: టీబీ డ్యాంలోకి ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుల మధ్య కొనసాగుతోంది. బుధవారం 17,383 క్యూసెక్కులు, గురువారం 7,069, శుక్రవారం నాటికి 9,582 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. అవుట్‌ఫ్లో 149 క్యూసెక్కులు ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 8.278 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- ఎస్పీ మాధవరెడ్డి




ముదిగుబ్బ: రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

ముదిగుబ్బ/బత్తలపల్లి/రామగిరి: ప్రజాజీవనానికి ఇబ్బంది కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారిని సహించకూడదన్నారు. త్వరలోనే డీఐజీ స్టేషన్లు తనిఖీ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ముదిగుబ్బ, బత్తలపల్లి, రామగిరి పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్లలో వివిధ రికార్డులు పరిశీలించారు. ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరును, సిబ్బంది పనితీరు, ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఆరా తీశారు. ఆయా స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కోర్టు ఆదేశాల మేరకు వేలం వేయాలన్నారు. మట్కా, జూదం, మద్యం అక్రమ రవాణా, తయారీపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడి సమస్య తెలుసుకోవాలని, చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకునే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

సరిహద్దులో నిఘా ఉంచండి

కర్ణాటక సరిహద్దులో ఉన్న రామగిరి మండలంలో నిఘా మరింత పెంచి మద్యం, ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు ఆరోహణరావు, చిన్నగౌస్, బత్తలపల్లి ఎస్ఐ శ్రీహర్షం, ముదిగుబ్బ ఎస్ఐ హేమంత్‌కుమార్, రామగిరి ఎస్ఐ జనార్దన నాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న 'నగరనామ్'



చిన్నారుల నృత్యప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ అసోం భక్తులు ఆలపించిన గీతాలతో ప్రశాంతి నిలయం పులకించింది. పర్తియాత్రలో భాగంగా అసోం భక్తులు శుక్రవారం పుట్టపర్తి చేరుకున్నారు. సత్యసాయి మహాసమాధి దర్శనం అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసోం సంస్కృతి సంప్రదాయాలను చాటుతూ 'నగరనామ్' పేరుతో వారు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం అస్సాం సంప్రదాయ నృత్యం 'హజాంగ్'తో సాయి వైభవాన్ని చాటుతూ ఆహూతులను మైమరపించారు. అనంతరం రూప్‌నగర్‌కు చెందిన బాలవికాస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నీటిబొట్టు.. ఒడిసిపట్టు!

ప్రకృతి సహకరించినా సరైన ప్రణాళిక లేకపోతే అంతా వ్యర్థమే. వర్షాలు తగినంత కురిసినా ఒడిసి పట్టకపోతే అంతా వృథానే. అందుకే ప్రభుత్వం వర్షం రూపంలో భూమిని చేరే ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఇంకుడుగుంతలను తవ్వుతోంది. తొలుత ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలు తవ్వేలా అధికారులు చర్యలు చేపట్టారు. తద్వారా భూగర్భజలమట్టం పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.



ఓ ప్రభుత్వ పాఠశాలలో పూర్తయిన ఇంకుడు గుంత

- భూగర్భజల మట్టం పెరిగేలా చర్యలు
- వర్షపు నీటిని భూమిలో ఇంకించేందుకు ప్రణాళిక
- ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతల తవ్వకానికి శ్రీకారం
- భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా డ్వామా చర్యలు
- రెండేళ్ల నుంచి కురిసిన వర్షాలతో ఆరు మీటర్లపైకి గంగమ్మ

సాక్షి, పుట్టపర్తి: భూగర్భ జలమట్టం పెరిగితే సాగు, తాగునీటికి ఢోకా ఉండదు. ఇందుకోసం వర్షరూపంలో వచ్చే నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ఉత్తమమైన మార్గంగా నిపుణులు చెబుతున్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు కూడా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షపు నీటిని ఒడిసి పడితే భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయని తేల్చి చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలు తవ్వించాలని డ్వామా అధికారులకు సూచించారు. ప్రతి మండలంలో కనీసం 10 గుంతలు తీయించాలన్నారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

టార్గెట్ 320..

జిల్లాలో భూగర్భజలాల పెంపునకు డ్వామా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 320 గుంతలు తీయించాలని లక్ష్యం విధించుకున్నారు. ఇప్పటికే ఇంకుడు గుంతలు తవ్వాల్సిన ప్రాంతాలను గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో పనులు కూడా ప్రారంభమయ్యాయి. రెండేళ్ల నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో భూగర్భజల మట్టం ఆరు మీటర్లపైకి వచ్చింది. ఇంకుడుగుంతల వల్ల వర్షపు నీరు అక్కడే భూమిలో ఇంకడం వల్ల భూగర్భజల మట్టం మరింత పైకి వచ్చే అవకాశం ఉంది.



ఇంకుడు గుంతకోసం స్థలం పరిశీలిస్తున్న అధికారులు

ఎక్కడెక్కడ గుంతలు తీస్తారంటే...

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు
- మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు
- ప్రభుత్వాస్పత్రులు, బల్క్ మిల్క్ సెంటర్లు
- మోడల్ స్కూళ్లు, కస్తూర్బా పాఠశాలలు
- గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు
- గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ భవనాల వద్ద

ప్రయోజనాలెన్నో..

- వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకుతుంది. ఫలితంగా నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూగర్భ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి. బోర్లు తవ్వితే నీరు పుష్కలంగా వస్తాయి
- ఇప్పటికే సాగునీరు అందిస్తోన్న బోర్లలో నీటి శాతం పెరుగుతుంది. మరింత భూమిలో పంటలు సాగు చేయొచ్చు.
- పారిశుధ్య నిర్వహణ బాగుంటుంది. రోగాలు దూరమవుతాయి.

గడువు లోపు లక్ష్యం పూర్తి



జిల్లా వ్యాప్తంగా 320 గుంతలు తీయించాలని లక్ష్యం విధించుకున్నాం. గుంతలు తీసే ప్రాంతాలను కూడా గుర్తించి పనులు చేపట్టాం. ఒకట్రెండు రోజుల్లో నిర్ణీత సంఖ్యను దాటేస్తాం. ఇంకుడు గుంతలతో వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి చేరుతుంది. ఫలితంగా బోర్లలో సమృద్ధిగా నీళ్లు వచ్చే అవకాశం ఉంది.
– రామాంజనేయులు, పీడీ, డ్వామా

పుష్కలంగా భూగర్భ జలం



జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం 12 మీటర్ల లోతులో ఉండగా.. ఏడాది కిందట ఆరు మీటర్ల పైకి వచ్చాయి. ఈ వేసవిలో కూడా జల మట్టం తగ్గలేదు. ఇంకుడుగుంతల వల్ల భూగర్భ జలాలు మరింతపైకి వచ్చే అవకాశం ఉంది.
– పి.రాజశేఖర్‌రెడ్డి, భూగర్భ జల శాఖాధికారి

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు

- పోలీసులు గ్రౌండ్ ప్రాక్టీస్ చేయాలి
- ఎస్పీ మాధవరెడ్డి



హోంగార్డుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న పోలీసు అధికారులు

పుట్టపర్తి టౌన్: పోలీసులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, అలాంటి వారే విధి నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. పోలీసులంతా ఫిట్‌గా ఉండాలని, ఇందుకోసం రోజు గ్రౌండ్ ప్రాక్టీస్ చేయాలని సూచించారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సౌతర్న్ హోంగార్డు కమెండెంట్ మహేష్ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్), స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ స్టేషన్ల పోలీస్ సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ఎస్పీ మాధవరెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరేడ్ అనేది క్రమశిక్షణకు నిదర్శనమని, పోలీస్ విధి నిర్వహణలో పరేడ్‌కు ఎంతో ఆవశ్యకత ఉందన్నారు. నెలలో రెండు సార్లు పరేడ్ నిర్వహించి పోలీసులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన జిల్లాలో వనరులు తక్కువగా ఉన్నా... విధులు చక్కగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. విధి నిర్వహణలో చిన్న, చిన్న అవాంతరాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఏదైనా సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు, బ్యాండ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు శ్రీశైలంరెడ్డి, టైటస్, నారాయణతోపాటు హోంగార్డులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



పరేడ్ నిర్వహిస్తున్న హోంగార్డులు, పోలీసులు

పేదల సంక్షేమం జగనన్న ఆశయం

- సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి
- అధికారులు బాధ్యతగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం
- కలెక్టరేట్‌లో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీన్ని గుర్తించి అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంత్రి అధ్యక్షతన పుట్టపర్తి నియోజక వర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలన్నీ పరిష్కరించేందుకు అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. నవరత్న పథకాల ద్వారా అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఎంత ముఖ్యమో అవినీతి రహిత పాలన కూడా అంతే ముఖ్యమన్నారు. అందువల్ల ఎక్కడా అవినీతి జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. జిల్లాకు రావాల్సిన నిధులపై అనంతపురం సీపీఓను సంప్రదించాలన్నారు. సీఎస్ఆర్ నిధులపై ప్రణాళికలు అమలు చేయాలన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.25 కోట్లతో చేపట్టిన 412 సీసీ రోడ్ల నిర్మాణ పనులు, అండర్ గ్రౌండు డ్రైనేజీ, అమృత్ పథకం పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు, ఎన్‌టీపీసీ అధికారులు, ఎమ్మెల్యేల అంగీకారంతో ఆగస్టులో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భూసేకరణ చేపట్టాలి ..

పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 193 చెరువులు నింపేందుకు అవసరమైన భూ సేకరణ చేపట్టాలన్నారు. అలాగే గాజులపల్లి, నల్లమాడ వద్ద రిజర్వాయర్లకు అవసరమైన భూసేకరణ పూర్తికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముదిగుబ్బ–బుక్కపట్నం వరకూ ఏర్పాటవుతున్న ఎన్‌హెచ్–342 రహదారి పనులు వేగవంతం చేసి అక్టోబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. 716జీ రహదారిలో జంక్షన్ల కోసం స్థల సేకరణ చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని పెడపల్లి–గాజుకుంటపల్లి డబుల్ రోడ్డుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణాలపై దృష్టి సారించండి

జగరాజుపల్లి, టి.కుంట్లపల్లి, నల్లమాడ, వెస్ట్‌గేట్ వద్ద విద్యుత్ సబ్ స్టేషన్లకు తగిన భూమిని గుర్తించాలన్నారు. జిల్లా కేంద్రంలో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, నియోజక వర్గంలోని అన్ని మండలాలకు 400 వరకూ విద్యుత్ స్తంభాలు కావాలన్నారు. ఓడీ చెరువులో 132 కేవీ సబ్‌స్టేషన్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

- నియోజకవర్గంలో 25 వేల ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని, వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు.
- నల్లమాడలో అండర్ గ్రౌండు డ్రైనేజీ నిర్మాణానికి రూ.3 కోట్లకు పరిపాలన అనుమతులు లభించినా పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.25 కోట్ల పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రానికి 50 ఎకరాలు కావాలని, సెల్‌ఫోన్ సిగ్నల్ అందని గ్రామాల్లో టవర్లు ఏర్పాటు చేయాలని, నల్లమాడ మార్కెట్ యార్డు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కోరారు.

రెండు నెలల్లో పురోగతి చూపించాలి..

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, అభివృద్ధి పనులకు సంబంధించి రెండు నెలల్లో పురోగతి చూపించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి, ఎమ్మెల్యే సూచనలను పాటిస్తూ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీహెచ్ఓ చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

'ఫ్యామిలీ ఫిజీషియన్'పై ప్రత్యేక దృష్టి

పుట్టపర్తి అర్బన్: 'ఫ్యామిలీ ఫిజీషియన్' విధానంపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. శుక్రవారం కేఎస్ జవహర్‌రెడ్డి విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ అవార్డు, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, విద్య, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి తగు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అలాగే గర్భిణులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి ఇళ్ల వద్దకే వెళ్లి చికిత్సలు అందిస్తున్నామన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కింద గ్రీవెన్స్‌లను త్వరగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, పంచాయతీ రాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ ఎంటీ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మసీదుల అభివృద్ధికి కృషి

ముదిగుబ్బ: జిల్లాలోని మసీదుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక జామియా మసీదు, మక్కా మసీదు, నూర్ ఏ మదీనా మసీదుల ముతవల్లీలు, ఇమామ్‌లతో సమావేశమయ్యారు. మసీదుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మెంబర్ చిన్న బాలమని, మైనార్టీ నాయకులు బాషాఖాన్, ఏ హసన్, మహబూబ్ బాషా, బాబా పకృద్దీన్, హైదర్‌వలీ, అమీర్‌బాషా, నిషార్ అహమ్మద్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నూరుల్లా

క్లుప్తంగా

రైతులకు విరివిగా రుణాలివ్వండి



బ్యాంక్ సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత

పుట్టపర్తి టౌన్: విరివిగా రుణాలు అందజేసి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత సిబ్బందికి సూచించారు. శుక్రవారం పుట్టపర్తి, కొత్తచెరువు మండల పరిధిలోని ఏడీసీసీ బ్యాంక్‌లను ఏడీసీసీ బ్యాంక్ జిల్లా చైర్‌పర్సన్ లిఖిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఉమాపతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

18న మినీ ఉద్యోగ మేళా

అనంతపురం: ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయం, అనంతపురంలో 18న నిరుద్యోగులకు మినీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్. ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. అనంతపురంలోని జెరీకార్ట్ కంపెనీలో టీపీఓ, పెనుకొండ కియా కంపెనీలో న్యాప్స్ ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. వివరాలకు 8317520929 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భారీ స్కోరు సాధించిన అనంతపురం జట్టు

- సెంచరీలతో చెలరేగిన గిరినాథరెడ్డి, ప్రశాంత్‌కుమార్



గిరినాథరెడ్డి



డీబీ ప్రశాంత్‌కుమార్

అనంతపురం: అంతర జిల్లా సీనియర్ మల్టీ డే మ్యాచ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన అనంతపురం, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. అనంతపురం జట్టు 133 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 697 భారీ పరుగులు సాధించింది. డీబీ ప్రశాంత్‌కుమార్ 156 పరుగులు (20 ఫోర్లు, 3 సిక్సర్లు), పి. గిరినాథరెడ్డి 152 పరుగులు (13 ఫోర్లు, 7 సిక్సర్లు), బి.యోగానంద 128 పరుగులు (20 ఫోర్లు) , జి. సంపత్ కుమార్ 86 (8 ఫోర్లు, మూడు సిక్సర్లు) పరుగులతో సమిష్టిగా రాణించారు. కర్నూలు జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 540 పరుగుల ఆధిక్యంలో ఉంది.

కన్నీళ్లకే కన్నీరు!

కన్నీళ్లకే కన్నీళ్లొస్తే.. కష్టానికే కష్టం వస్తే.. అనే మాట ఆ బాలిక జీవితానికి సరిపోదు. ఓ వైపు మంచం పట్టేలా చేసిన నరాల వ్యాధి.. మరోవైపు వెక్కిరిస్తున్న పేదరికంతో అల్లాడిపోతోంది. కుటుంబ పెద్ద కూడా ఆత్మహత్యకు పాల్పడటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

- నరాల వ్యాధితో మంచం పట్టిన బాలిక
- ఓ వైపు తండ్రి మరణం.. మరోవైపు పేదరికంతో నరకయాతన
- ప్రభుత్వ పింఛనే జీవనాధారం
- వైద్యం కోసం ఆపన్నుల సాయానికి ఎదురుచూపు



నిఖితకు సపర్యలు చేస్తున్న తల్లి నాగదేవి

ధర్మవరం: ఆ బాలికకు పట్టుమని పదహారేళ్లు కూడా లేవు.. అందరి లాగా ఆడుతూ పాడుతూ తిరగాల్సిన వయసులో అంతుచిక్కని వ్యాధి బారిన పడింది. కదిలేందుకు వీల్లేకుండా మంచానికే పరిమితమైంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు డబ్బుల్లేవు. ఎంతో ప్రేమగా చూసుకునే తండ్రి కూడా ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబం మరింత కష్టాలపాలైంది. ప్రభుత్వం అందించే పింఛన్‌తో పాటు తల్లి కూలి పనులకు వెళ్తూ ఆ కుటుంబాన్ని పోషిస్తోంది. మెరుగైన వైద్యం కోసం ఆపన్నులను వేడుకుంటున్న తీరు చూస్తే ఎవరికైనా కళ్లు చెమర్చక మానవు.

8 ఏళ్లుగా నరాల వ్యాధితో...

ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామినగర్‌లో నివాసం ఉంటున్న నాగదేవి, రమణలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి పెద్ద కుమార్తె నిఖిత (16) గత 8 ఏళ్లుగా నరాల వ్యాధి (సెరిబ్రో మస్కులర్ డిస్ట్రఫీ) తో బాధపడుతోంది. క్రమ క్రమంగా వ్యాధి తీవ్రత ముదిరింది. ఈ క్రమంలోనే చేనేతమగ్గం నేస్తూ జీవనం సాగించే తండ్రి రమణ... కుమార్తె పరిస్థితితో పాటు అప్పులు, పేదరికం పరిస్థితుల కారణంగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

దిక్కుతోచని స్థితిలో...

ఇంటి పెద్ద మరణంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటూ తల్లి నాగదేవి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. వీలైనంత వరకు ఆర్డీటీ ఆసుపత్రిలో నిఖితకు చికిత్స చేయించింది. అయితే నిఖితను పరీక్షించిన వైద్యులు బాలిక ఒంట్లో నరాలు, కండరాలు చచ్చు పడ్డాయని బెంగుళూర్‌కు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలని సూచించారు. అయితే వైద్య ఖర్చులకు రూ.5 లక్షల వరకు అవుతాయని చెప్పడంతో అంత డబ్బు వెచ్చించే స్తోమత లేక ఇంట్లోనే ఉంచేశారు. ఇలా రెండేళ్ల పాటు మంచంలోనే ఉండటంతో బాలిక పరిస్థితి మరింత విషమించింది. దీంతో ఏంచేయాలో ఎలా వైద్యం చేయించుకోవాలో తెలియక ఆ కుటుంబం దిక్కుతెలియని స్థితిలో నరకయాతన పడుతోంది. బెంగళూరులో నాణ్యమైన వైద్యం అందిస్తే తప్పకుండా మెరుగవుతుందని వైద్యులు చెబుతున్నా అంత స్తోమత తమకు లేదని దయగల మా రాజులు ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

సాయం చేయాలనుకుంటే..

పేరు : నాగదేవి
అకౌంట్ నంబర్: 91063679999
ఐఎఫ్ఎస్‌సీ: ఏపీజీబీ0001029
అలాగే 9392197122 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చు.

నా బిడ్డను బతికించండయ్యా..

రోజూ నేను కూలి పని చేస్తే తప్ప పూట గడవడం లేదు. పాప నిఖిత మంచాన పడటంతో ఏ పని చేసుకోలేని పరిస్థితి. వైద్యం అందించే స్తోమత లేకపోవడంతో రోజు రోజుకూ పాప ఆరోగ్యం విషమిస్తోంది. నరాలు చచ్చుబడిపోవడంతో కనీసం లేవలేకపోతోంది. బెంగళూర్‌లో వైద్యం అందిస్తే నయం అయ్యే అవకాశం ఉందని ఆర్డీటీ ఆస్పత్రిలో వైద్యులు చెప్పారు. వైద్య ఖర్చులకు రూ.5 లక్షలకు పైగా అవుతాయనడంతో ఏమీ చేయలేక నిఖితను ఇంట్లోనే ఉంచుకున్నాం. దయగల మా రాజులు సాయం అందించి ఆదుకుంటే పాపను బతికించుకుంటాం.

– నాగాదేవి, నిఖిత తల్లి

కేజీబీవీ టీచర్ల ఎంపిక జాబితా విడుదల

- నేడు సైన్స్‌సెంటర్‌లో నియామక కౌన్సెలింగ్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న 279 పోస్టులకు (ప్రిన్సిపాల్, సీఆర్టీ, పీజీటీ, పీఈటీ) సంబంధించి ఎంపిక జాబితాను శుక్రవారం విడుదల చేశారు. అకడమిక్ మెరిట్, స్కిల్ టెస్ట్ మెరిట్, రోస్టర్ ప్రకారం 277 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సమగ్ర శిక్ష ఏపీఓ, డీఈఓ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఎంపీహెచ్‌డబ్ల్యూలో క్వాలిఫైడ్ అభ్యర్థులు లేక ఒక పోస్టు, పీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టు, స్పోర్ట్స్ కోటాలో ఒక పోస్టు పెండింగ్ పెట్టినట్లు పేర్కొన్నారు. ఎంపికైన 277 మంది అభ్యర్థులకు ఫోన్‌కాల్, వాట్సాప్ మెసేజ్ ద్వారా సమాచారం పంపామన్నారు. ఎంపికైనా వారికి శనివారం ఉదయం 9 గంటలకు అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందచేస్తామని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు https:// samagrashikshaatp. blogspot. com అనే వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

ఉపాధ్యాయురాలి ఇంట్లో భారీ చోరీ

- 40 తులాల బంగారం, 15 కేజీల వెండి అపహరణ



బాధితురాలు లక్ష్మి

హిందూపురం అర్బన్: పట్టణంలోని చైతన్యనగర్ (ఆర్టీసీ కాలనీ సమీపంలో) నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు లక్ష్మి ఇంట్లో గురువారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. బాధిరాలి ఫిర్యాదు మేరకు... ఉపాధ్యాయురాలు లక్ష్మి బంధువులు మృతి చెందడంతో ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం బెంగళూరు వెళ్లారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి లోపలికి వెళ్లారు. బీరువా తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న 40 తులాల బంగారం, 15 కిలోల వెండి, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్న లక్ష్మి ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రఫీక్ ఆధ్వర్యంలో వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించిందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హోరూన్ తెలిపారు. ప్రజలు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లితే (ఎల్‌హెచ్‌ఎంఎస్) లాక్డ్ హౌస్ మానిటర్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కష్టపడి సంపాదించినదంతా దోచుకెళ్లారంటూ ఉపాధ్యాయురాలు లక్ష్మి కన్నీరు మున్నీరయ్యారు.



ఉపాధ్యాయురాలు లక్ష్మి ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రెండిళ్లలో చోరీ..

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలో గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు.. గ్రామానికి చెందిన కళావతమ్మ, చంద్రకళ (చెన్నక్క)లు ఇళ్లకు తాళాలు వేసుకొని ఊరికి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి దొంగలు ఇళ్లకు వేసిన తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లారు. కళావతమ్మ ఇంట్లోని బీరువా తలుపులు తెరిచి కొంత నగదు, బంగారు వస్తులవులను దొంగిలించారు. అయితే చంద్రకళ ఇంట్లోకెళ్లి గాలించినా ఏమీ దొరక్కపోవడంతో వస్తువులను చిందర వందరగా పడేశారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



లక్ష్మిదేవమ్మ (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని బూచెర్ల గ్రామానికి చెందిన కాపు లక్ష్మిదేవమ్మ (47) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుమార్తె రాజేశ్వరి భర్త వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో పాటు అప్పులు బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతరాలి భర్త 20 ఏళ్ల క్రితం మృతిచెందాడన్నారు. సర్పంచ్ సోమిరెడ్డి, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి తదితరులు మృతురాలి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగస్వామి చెప్పారు.

ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి

పరిగి: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో అబ్రహాం (19) అలియాస్ బాబు అనే యువకుడు మృతి చెందారు. ఏఎస్‌ఐ జయలత వివరాలమేరకు.. 40 ఇండ్ల కాలనీకి చెందిన సన్నాయప్ప కుమారుడు అబ్రహాం దిన కూలీగా పని చేస్తున్నాడు. సాయంత్రం ఇటుక బట్టీల దగ్గరకు ట్రాక్టరుపై వెళ్తుండగా ట్రాక్టర్ ఇంజనుపై ప్రయాణిస్తున్న అబ్రహాం అదుపు తప్పి ట్రాక్టర్ చక్రాల కింద పడటంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూ (ఏ)లో పదోన్నతులు



జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దనతో పదోన్నతులు దక్కిన ప్రొఫెసర్లు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో శుక్రవారం కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద పదోన్నతులు కల్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ ఉత్తర్వులు అందజేశారు. పదోన్నతులు పొందిన వారికి వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్ అభినందనలు తెలిపారు.

పేరు	ప్రస్తుత స్థానం	పదోన్నతి పొందిన స్థానం
కే.మాధవి	అసోసియేట్	ప్రొఫెసర్
ఎస్.చంద్రమోహన్‌రెడ్డి	అసోసియేట్	ప్రొఫెసర్
డి. విష్ణువర్ధన్	అసోసియేట్	ప్రొఫెసర్
ఏపీ.శివకుమార్	అసోసియేట్	ప్రొఫెసర్
బి. దిలీప్‌కుమార్	అసోసియేట్	ప్రొఫెసర్
కే. శేషుమహేశ్వరమ్మ	అసోసియేట్	ప్రొఫెసర్
కే. జితేంద్రగౌడ్	అసిస్టెంట్	అసోసియేట్ ప్రొఫెసర్
ఎస్. అరుణ మస్తాని	అసిస్టెంట్	అసోసియేట్
కే.కళ్యాణిరాధ	అసిస్టెంట్	అసోసియేట్
ఎస్.సరిత	అసిస్టెంట్	అసోసియేట్
ఏ. శైలాకుమారి	అసిస్టెంట్	అసోసియేట్
ఆర్ .మంజుల	అసిస్టెంట్	అసోసియేట్
ఎం. సాంబయ్య	అసిస్టెంట్	అసోసియేట్

మంత్రిని కలిసిన ప్రజాప్రతినిధులు,అధికారులు



మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసిన ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి, శంకరనారాయణ



మంత్రిని కలిసిన అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి



మంత్రి జయరాంకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్, జేసీ .. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



మంత్రి జయరాంను కలిసిన ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాంను పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం రాత్రే విచ్చేసిన మంత్రి గుమ్మనూరు జయరాం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పెనుకొండ, కదిరి ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకరనారాయణ, సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కలిశారు. అలాగే కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతన్, జిల్లా అగ్రీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, పుట్టపర్తి రూరల్, కొత్తచెరువు వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు నరసారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ కుళ్లాయిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు నారాయణరెడ్డి , పాదయాత్ర శంకర్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

డీపీటీఓపై చర్యలు తీసుకోండి



ఇన్‌చార్జ్ మంత్రి జయరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: 'జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీలో ఏపీపీటీడీ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్‌పై చర్యలు తీసుకోవాలి' అంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) నాయకులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూర్ జయరామ్‌ను కోరారు. శుక్రవారం పుట్టపర్తి పర్యటనకు విచ్చేసిన కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు ఎన్ఎంయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల్లో 25 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారు బాధ్యతగా పనిచేస్తుంటే డీపీటీఓ మధుసూదన్ క్రిందిస్థాయి ఉద్యోగులను చులకనగా చూడటం , నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. కేంద్ర కార్యాలయం ఇచ్చిన నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వార్షిక ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తున్నారని విమర్శించారు. వీటిని ప్రశ్నించిన నాయకులపై అక్రమంగా విచారణ జరిపి సస్పెన్షన్, బదిలీ, డబుల్ డ్యూటీలు వేయించడం వంటివి చేస్తున్నారని వివరించారు. వెంటనే మధుసూదన్‌పై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి గుమ్మనూరు జయరామ్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబుకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షబ్బీర్, రీజినల్ నాయకులు రవితేజ, తిరుపతమ్మ, చంద్రాయుడు, డిపో నాయకులు బాజ్జాన్, శివారెడ్డి,విజయలక్ష్మి, ప్రేమ్‌కుమార్, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏఓ పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం !

- పనితీరు మార్చుకోవాలని హెచ్చరిక

రొళ్ల: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి పనితీరుపై కలెక్టర్ అరుణ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 15 రోజులుగా సచివాలయాల వారీగా జరుగుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్లకు కూడా జగనన్న సురక్ష కార్యక్రమంతో సంబంధం లేదు.. అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని ఏఓ అన్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన కలెక్టర్ అరుణ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఏఓపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. మండల, గ్రామ స్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలకు విధిగా హాజరు కావాలని ఏఓకు వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

ఏఓపై ఉన్నతాధికారులకు ఎంపీపీ ఫిర్యాదు..

ఏఓ రాజ్యలక్ష్మి పని తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ కవిత తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు వివిధ పనుల విషయంలో ఏఓ దురుసు ప్రవర్తిస్తున్నారని ఎంపీపీ కవిత విమర్శించారు. కార్యాలయానికి కూడా సరైన సమయానికి హాజరు కాకపోవడం లేదన్నారు.

ఎంపీపీ భర్తపై కేసు నమోదు..

ఏఓ రాజ్యలక్ష్మి ఎంపీపీ కవిత భర్త విజయరంగేగౌడుపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హార్టికల్చర్ అసిస్టెంట్ కిరణ్‌పై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి ఆయనను కార్యాలయంలో నిర్బంధించి తాళాలు వేశారన్నారు. ఏఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం, బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులను అమలు చేస్తున్నాయి. ఇందులో అడ్మిషన్లు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ అయింది. ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా బీటెక్ బ్రాంచ్‌లో తొలి మూడు సంవత్సరాలు , ఒక సంవత్సరం బీటీహెచ్ స్వీడన్‌లో బీఎస్ కోర్సు చేయాల్సి ఉంటుంది. అనంతరం రెండు సంవత్సరాల ఎంఎస్ కోర్సును స్వీడన్‌లో అభ్యసించవచ్చు.

- బీటెక్ కోర్సు మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లోనూ, ఒక సంవత్సరం విద్యను బీటీహెచ్ స్వీడన్‌లో పూర్తిచేయాల్సి ఉంటుంది. డిగ్రీని జేఎన్‌టీయూ అనంతపురం ప్రదానం చేస్తుంది. బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (బీటీహెచ్) స్వీడన్ ప్రదానం చేస్తుంది.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ కంప్యూటర్ సైన్స్ (10 ఖాళీలు) ఇందులో విద్యార్థి బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లో 3 సంవత్సరాలు . స్వీడన్‌లో ఒక సంవత్సరం చదువుతారు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 10 ఖాళీలు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మెషిన్ లెర్నింగ్‌లో 10 ఖాళీలు ఉండగా, జేఎన్‌టీయూ అనంతపురంలోని ఈసీఈ విభాగంలో మూడు సంవత్సరాలు, చివరి సంవత్సరం బ్లెకింగ్ వర్సిటీలో చదువుతారు.

విద్యార్హతలు..

ఇంటర్మీడియట్ ఎంపీసీ కోర్సును పూర్తి చేసిన వారు అర్హులు. కనీసం 70 శాతం మార్కులు పొందాలి. జేఈఈ మెయిన్స్ -2023, ఏపీ ఈఏపీసెట్ -2023, టీఎస్‌ఈఏపీసెట్ – 2023 ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. బీటీహెచ్, స్వీడన్ మెరిట్ ఆధారిత ఉపకారవేతనాలు అందిస్తారు. పూర్తి వివరాలను జేఎన్‌టీయూ అనంతపురం ఫారిన్ ఎఫైర్స్ డైరెక్టర్ లేదా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌లో తెలుసుకోవచ్చు.

విదేశీ విద్యార్థులకు ఆహ్వానం

జేఎన్‌టీయూ అనంతపురంలో విదేశీ విద్యార్థులకు బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. బీటెక్ (సివిల్, ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ, కెమికల్, ఫుడ్ టెక్నాలజీ) , ఎంటెక్ (స్ట్రక్చరల్, బ్రిడ్జెస్ అండ్ టన్నెల్స్, ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, కంప్యూటర్ సైన్సెస్, నానో టెక్నాలజీ) , ఎంసీఏ, ఎంబీఏ, కోర్సుల్లో విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సార్క్ దేశాల విద్యార్థులకు 30 శాతం కోర్సు ఫీజులో రాయితీ, 40 శాతం డెవలప్‌మెంట్ ఫీజు రాయితీ లభిస్తుంది. పూర్తి వివరాలకు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

చెస్ చాంపియన్‌షిప్ పోటీలు రేపు

హిందూపురం టౌన్: ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లా ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ బాబు, నాగార్జున తెలిపారు. పట్టణంలోని వాసవీ విన్నర్స్ పాఠశాల వేదికగా చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో టాప్–2లో నిలిచిన వారు ఈ నెల 23 నుంచి భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి ర్యాపిడ్, బ్లిట్జ్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9182611281కు సంప్రదించాలని టోర్నమెంట్ డైరెక్టర్ ఆరీఫుల్లాఖాన్ సూచించారు.